

నేడు గంగారం రైతు వేదికలో గ్రీవెన్స్ సెల్

● కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : గంగారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీలోని గ్రామాల ప్రజల సౌకర్యార్థం వారికి మరిన్ని సేవలందించేందుకు నేడు గంగారంలోని రైతు వేదికలో ఉదయం 10.30 గంటల నుంచి 12.30గంటల వరకు గ్రీవెన్స్‌సెల్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాగా, కలెక్టర్ పాల్గొని దరఖాస్తులను స్వీకరించనున్నారు.

వస్త్ర పరిశ్రమకు మహర్దశ

పీఎం మిత్రలోకి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు



- బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టుగా కేఎంటీపీని చేపట్టనున్న కేంద్ర జౌళిశాఖ
- 2023లోనే దేశంలో ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కులను ప్రకటించిన కేంద్రం
- వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుపై అప్పట్లో పేచీలు
- బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిపాదనలను పక్కన పెట్టిన వైనం
- సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో చేర్చేందుకు కేంద్రం మొగ్గు
- పథకంలో చేతే కొత్తగా కంపెనీలు తరలివచ్చే అవకాశం
- రెండు లక్షల మందికి కలగనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

వస్త్ర హబ్‌గా వరంగల్‌ను తయారు చేసేందుకు అడుగులు పడుతున్నాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ (కేఎంటీ) పార్కును ప్రధానమంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అప్పారెల్ (పీఎం మిత్ర) పార్కులో కేంద్ర ప్రభుత్వం చేర్చింది. బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టు అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. అయితే 2023లోనే దేశంలో ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కులను ప్రకటించింది. అయితే అప్పటి బీఆర్ఎస్ హయాంలో అనేకమార్లు పీఎం మిత్రలో కేటీఎంపీని చేర్చాలని ఒత్తిడి చేసినప్పటికీ నిబంధనలకు అనుకూలంగా లేదని కేంద్రం దాట వేసింది. ఎట్టకేలకు సీఎం రేవంత్‌రెడ్డి ఒత్తిడితో కేంద్రం పీఎం మిత్రలో బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టుగా అభివృద్ధికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో సుమారు 2లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు పెట్టేందుకు కొత్త కంపెనీలు వరంగల్ టెక్స్‌టైల్ పార్కుకు వచ్చే అవకాశం ఉంది.

అజంజాహి మిల్లు స్థానంలో..

ఒకప్పుడు ఓరుగల్లులో అజంజాహి మిల్లు వేలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పించింది. ఆ మిల్లు మూతపడిన తరువాత పత్తి ఎక్కువగా సాగయ్యే వరంగల్‌లో మరో పరిశ్రమ కోసం స్థానికులు ఎదురుచూశారు. అయితే వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట, సంగెం మండలం చింతలపల్లి గ్రామాల్లో 2వేల ఎకరాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేసింది. తొలి దశలో 1,350 ఎకరాల భూమిని సేకరించారు. 2017 అక్టోబరు 22న అప్పటి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించారు. టీఎస్ఐసీసీ సుమారు రూ.980కోట్లతో డ్రైనేజీలు, అంతర్గత రోడ్లు, విద్యుత్ సరఫరా, నీటి సరఫరా, వ్యర్థాల శుద్ధి తదితర మౌలిక వసతులు కల్పించారు. మరో రూ.370కోట్లతో కేఎంటీపీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించింది. ఇందులో పెట్టుబడులకు అప్పటి ప్రభుత్వం 22 సంస్థలతో రూ.3,900కోట్లతో ఒప్పందం చేసుకుంది. ప్రస్తుతం ఈ రెండు కంపెనీలే ఇక్కడ ఉత్పత్తి చేపట్టాయి. 2023 డిసెంబరులో సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి టెక్స్‌టైల్ పార్కుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు.

వస్త్రనగరిపై ప్రభుత్వం నజర్

కేంద్ర ప్రభుత్వం 2020-21లో వస్త్ర పరిశ్రమల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా మెగా ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఇందు కోసం ప్రధానమంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అపెరల్ (పీఎం మిత్ర) పథకాన్ని ప్రారంభించింది. ఫార్మ్, ఫైబర్, ఫ్యాక్టరీ, ఫ్యాషన్, ఫారిన్ (ఫైవ్‌ఎఫ్) విధానంతో టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికోసం 2020-21 నుంచి 2027-28 ఆర్థిక సంవత్సరం వరకు రూ.4,445కోట్లు వెచ్చించేలా ప్రణాళిక రూపొందించారు. దేశవ్యాప్తంగా 20లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించేందుకు ఏడు టెక్స్ పార్కుల్లో తెలంగాణకు ఒకటి కేటాయిస్తున్నట్లు 2023 మార్చి 18న ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. దీంతో తెలంగాణలో హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ నగర సమీపంలో అప్పటికే కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)ను పీఎం మిత్ర కింద అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టులు లేవని, గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులే చేపట్టామని కేంద్ర జౌళిశాఖ అధికారులు పేర్కొన్నారు. దీనికి తోడు అప్పట్లో కేంద్రంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఘర్షణాత్మక వైఖరి అవలంబించటంతో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు కేంద్రం కొర్రీలు పెట్టిందనే విమర్శలున్నాయి. అయితే పీఎం మిత్ర నిబంధనల ప్రకారం టెక్స్‌టైల్ పార్కు కోసం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి ఎకరాల భూమిని కేటాయించాలి. అలాగే రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ పిలిచి డెవలపర్‌ను ఎంపిక చేయాలి. మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించి దానికి టెక్స్‌టైల్ శాఖ ఆమోదం పొందాల్సి ఉంటుందని జౌళిశాఖ అధికారులు స్పష్టం చేశారు. అలాగే అంతర్గత రోడ్లు, విద్యుత్ సరఫరా,

(మిగతా 7లో..)





నేటి నుంచి పాఠశాలల్లో రాగిజావ

- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ
- జిల్లాలో 40,900 మంది విద్యార్థులకు అమలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి సర్కార్ బడులల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు రాగిజావ అమలు చేసేందుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్‌నికోలస్ ఆగస్టు 30న ఉత్తర్వులు జారీ చేశారు. 2025-26 విద్యాసంవత్సరం కూడా శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు సహకారంతో ఈ పథకం అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ ట్రస్టు రాగిజావ తయారికి అవసరమైన రాగిపౌడర్, బెల్లం పౌడర్ సరఫరా చేస్తుందని పేర్కొన్నారు. రాగిజావ తయారుచేసి అందించినందుకుప్రతీ గ్లాసుకు రోజుకు 25 పైసల చొప్పున చార్జీలను సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు చెల్లించనున్నారు. మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు- 677, ప్రాథమికోన్నత పాఠశాలలు-120, ఉన్నత పాఠశాలలు-102, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు-16, మోడల్ స్కూల్స్-8 మొత్తం 923 పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలలో సుమారు 40, 900 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

రెండున్నర నెలలు ఆలస్యం..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా విద్యార్థులకు రాగిజావ అందిస్తుంది. వారంలో మూడురోజులు కోడిగుడ్లు, మరో మూడురోజులు రాగిజావ ఇస్తున్నారు. వరుసగా మూడో సంవత్సరం కూడా అందించేందుకు పాఠశాల విద్యాశాఖ అధికారులు, విద్యాశాఖ ఫైనాన్స్‌శాఖ అధికారులకు ప్రపోజల్స్ పంపారు. ఈ ఏడాది జూన్ 12 పాఠశాలలు పునఃప్రారంభం కాగా, ప్రపోజల్ ఫైల్‌కు ఫైనాన్స్ అధికారుల నుంచి ఆమోదం రాకపోవడంతో రాగిజావ అమలు ఆలస్యమైనట్లుగా తెలుస్తోంది. ఉపాధ్యాయ సంఘాల నుంచి ఒత్తిడి పెరగడంతో గత నెలలో ఫైనాన్స్ శాఖ ఆ ఫైల్‌కు క్లియరెన్స్ ఇచ్చింది. కానీ, విద్యాశాఖ అధికారులు అనుమతించేందుకు మరో నెలన్నరసమయం పట్టినట్లు తెలుస్తోంది. తాజాగా సెప్టెంబరు 1 నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ అందించేందుకు ఉత్తర్వులు జారీ చేయడంతో విద్యార్థుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముదిరాజులు ఒక్క తాటిపై నిలబడాలి

- హక్కుల కోసం పోరాటానికి సమాయత్తం కావాలి
- మత్స్యశాఖ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్



సమావేశంలో మాట్లాడుతున్న బండా ప్రకాశ్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్క తాటిపై నిలబడి, ఏ జెండాపై పోటీ చేసినా ముదిరాజు బిడ్డలను గెలిపించుకోవాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాశ్ పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిల్లో మదిరాజు ప్రజాప్రతినిధులను పెంచుకోవాలని సూచించారు. మహబూబాబాద్ బాలాజీ గార్డెన్స్‌లో ఆదివారం తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లాస్థాయి విస్తృత సమావేశాన్ని చిల్లా సహదేవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో ముదిరాజులు అత్యధికంగా ఉన్నప్పటికి రాజకీయంగా ఎదగడం లేదని, స్థానిక ఎన్నికల్లో అంతా ఒక్కతాటిపైకి వచ్చి ముదిరాజులకు గెలిపించుకుని సత్తా చాటాలన్నారు. తమ హక్కుల సాధన, ఆత్మగౌరవంకోసం పోరాటాలకు సమాయత్తం కావాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు.

నిధులు మంజూరు లేదు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో

(మిగతా 8లో..)

బీసీ-ఏలో చేర్చాలి..

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు ముందుకు వస్తున్న రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్-15ను అమలు చేసి, ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని బండా ప్రకాశ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 1250 మత్స్యశాఖ సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన కులాల్లో ముదిరాజ్ కులస్థులు అత్యధికంగా ఉన్నట్లు సర్వేల్లో తేలిందని, వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 128 జీవో ప్రకారం చెరువులు, కుంటలు మత్స్యశాఖకు అప్పగించాలన్నారు. మత్స్యశాఖ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం బండా ప్రకాశ్‌ను ఘనంగా సన్మానించారు.

రైతులకు తప్పని యూరియా తిప్పలు

● పట్టా, ఆధార్ జిరాక్స్ పేపర్లను విసిరేసిన అధికారులు



మరిపెడ పీఏసీఎస్ దగ్గర సిబ్బంది విసిరేసిన పట్టా, ఆధార్ జిరాక్స్ ప్రతులను ఏరుకుంటున్న రైతులు

మరిపెడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా తిప్పలు ఇంకా తప్పట్లేదు. ఎరువులతో ఎదిగే వరి, పత్తి పంటలు యూరియా లభించక రైతన్నలు తలలు పట్టుకుంటున్నారు. బస్తాల కోసం తెల్లారకముందే వచ్చి క్యూలైన్లో రైతులు పడిగాపులు కాస్తున్నారు. శనివారం మరిపెడ పీఏసీఎస్‌కు యూరియా కోసం వచ్చిన రైతుల పట్టా, ఆధార్ జిరాక్స్ పేపర్లను వ్యవసాయశాఖ సిబ్బంది విసిరేసి వారిని అవమానానికి గురి చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో కోపోద్రుక్తులైన రైతులు అధికారులపై మండిపడ్డారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్స్ వ్యవసాయశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే. మరిపెడ పీఏసీఎస్‌కు శనివారం 200 బస్తాల యూరియా రాగా, సుమారు 2వేల మందికి పైగా వచ్చారు. రైతుల నుంచి వ్యవసాయశాఖ సిబ్బంది పట్టా, ఆధార్ జిరాక్స్ ప్రతులను సేకరించి వరుస క్రమంలో యూరియా బస్తాలను పంపిణీ చేస్తున్నారు. మనిషికి ఒక్క బస్తా చొప్పు రెండు వందల మంది రైతులకు 200 బస్తాల యూరియా సరఫరా చేశారు. ఇక యూరియా లేదని తెలిసి రైతులు ఒకేసారి వ్యవసాయ సిబ్బందిపై ఎగబడడంతో వారు పట్టా, ఆధార్ ప్రతులను కింద విసిరేశారు. దీంతో ఆగ్రహించిన అన్నదాతలు వ్యవసాయశాఖ అధికారుల తీరుపై కన్నెర్ర చేసి కిందేసిన పేపర్లను ఏరుకున్నారు. ఈ విషయంపై వ్యవసాయ శాఖ అధికారులను వివరణ కోరగా.. రైతుల నుంచి సేకరించిన కాగితాలను టేబుల్‌పై పెట్టగా, వారు మూక్కుమ్మడిగా ఎగబడడంతో అవి టేబుల్‌పై నుంచి కింద పడిపోయాయని తెలిపారు.



యూరియా.. రామచంద్రా!

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా కోసం రైతులు తండ్లాడుతున్నారు. బస్తాల కోసం పడిగాపులు గాస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో అన్ని పంటలకు అవసరముండటంతో యూరియా అవసరం ఏర్పడింది. దీంతో బస్తాల కోసం గంటల కొద్ది క్యూ లైన్‌లలో రైతులు నిలబడడం, రాత్రుళ్లు దుకాణాల ముందు, ప్రాథమిక సహకార సంఘాల ఎదుట పడుకోవడం, తోపులాటల మధ్య రోడ్లపై ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు.

సొసైటీల ఎదుట క్యూ లైన్‌లో గంటల కొద్దీ నిలబడ్డా కానీ యూరియా బస్తా దొరుకుతుందని గ్యారెంటీ లేదు. ఒకవేళ దొరికితే బస్తా మాత్రమే లభిస్తుంది. ఒక్కో రైతు పది ఎకరాల వరకు సాగు చేస్తుండడంతో బస్తా కోసం మళ్లీ తెల్లవారుజామునే క్యూలైన్‌లలో నిలబడడానికి పరుగులు పెట్టాల్సిన పరిస్థితి. వృద్ధ రైతులు, మహిళ రైతులైతే గంటల తరబడి లైన్‌లలో నిలబడ లేక సొమ్మసిల్లుతున్న సందర్భాలూ ఉన్నాయి. ఒక్క యూరియా బస్తా అయినా ఇప్పించండి అంటూ వ్యవసాయాధికారుల కాళ్లపై పడుతున్న దీనస్థితి నెలకొంది.

మహబూబాబాద్ జిల్లాలో ప్రస్తుతం ఏ మండలంలో చూసినా.. ముఖ్యంగా ఏజెన్సీ మండలాల్లో కన్పిస్తున్న దృశ్యం ఇది.. జిల్లాలో ఇప్పటి వరకు 21, 821 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. గతేడాదితో పోల్చి చూస్తే 3,407 మెట్రిక్ టన్నుల యూరియా లోటుగా ఉంది.



గూడూరు మండలంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు(ఫైల్)

- ఇంకా తీరని బస్తాల కొరత
- ఇప్పటి వరకు 21,821 మెట్రిక్ టన్నుల సరఫరా
- గతేడాదితో పోలిస్తే 3,407 లోటు..
- కొనసాగుతున్న రైతుల ఆందోళనలు

ఏజెన్సీ మండలాల్లో ఇలా..

మహబూబాబాద్ జిల్లాలో యూరియా కొరత ఇప్పట్లో తీరేటట్టు కనబడడం లేదు. ఏజెన్సీ మండలాలైన గూడూరు, కొత్తగూడ, గంగారం, బయ్యారం మండలాలతో పాటు ఇతర మండలాల్లో కూడా పంటల విస్తీర్ణం పెరగడంతో యూరియా వాడకం పెరిగింది. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో అధికారికంగా పంటల సాగు విస్తీర్ణం లెక్కలు తక్కువగా ఉండడం, పోడు వ్యవసాయం, ఇతర వ్యవసాయం రికార్డుల్లో ఎక్కని భూముల్లో వ్యవసాయం చేస్తుండడంతో పంటల విస్తీర్ణం

(మిగతా 8లో..)

బస్తాలు రాబడులు ఇలా..

జిల్లాలో యూరియా గతేడాది 25,228 మెట్రిక్ టన్నులు రాగా, ఈ ఏడాది శనివారం నాటి వరకు 21,821 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వచ్చింది. అంటే గత ఏడాది రాబడులతో పోల్చి చూస్తే 3,407 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలో లోటుగా తేలింది. ముఖ్యంగా ఏజెన్సీ మండలాలైన కొత్తగూడలో గతేడాది 2,575 రాగా, ఇప్పటి వరకు 1,453 వచ్చింది. 1,122 మెట్రిక్ టన్నుల లోటు యూరియాగా ఉంది. గూడూరులో గతేడాది 1,893 మెట్రిక్ టన్నుల యూరియా రాగా, ఈ సారి 1,555 మెట్రిక్ టన్నులు వచ్చింది. ఇంకా 337 మెట్రిక్ టన్నుల లోటు ఉంది. గంగారంకు గతేడాది 3,038 మెట్రిక్ టన్నులు రాగా, ఈ ఏడాది 2,632 మెట్రిక్ టన్నులు వచ్చింది. 406 మెట్రిక్ టన్నుల యూరియా లోటు ఉంది. బయ్యారంలో గతేడాది 2,711 రాగా, ఇప్పటి వరకు 2,405 మెట్రిక్ టన్నులు వచ్చింది. 285 మెట్రిక్ టన్నుల లోటు ఉంది. ఈ ఏజెన్సీ మండలాలతో పాటు ఇతర మండలాలైన తొర్రూరులో 863 లోటు ఉండగా కేసముద్రంలో 289 మెట్రిక్ టన్నులు, మహబూబాబాద్‌లో 264, చిన్నగూడూరులో 211, ఇనుగుర్తిలో 160 మెట్రిక్ టన్నుల లోటు ఉంది. ఈ సెప్టెంబర్ నెలలో యూరియా కోట విడుదల అవుతేనే యూరియా కొరత తీరేటట్లు లేదు.



బీఆర్ఎస్ నాయకులు, రైతులకు నచ్చజెప్పుతున్న ఎస్సై కమలాకర్

యూరియా అందించాలని రాస్తారోకో

గోవిందరావుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో పీఏసీఎస్ ఎదుట ఆదివారం నిరసన తెలిపారు. జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు లకావత్ నర్సింహనాయక్ మాట్లాడుతూ యూరియా కోసం రైతులు వ్యవసాయ పనులను మానుకుని రోజువారీగా తిరుగుతున్నా ఒక్క బస్తా కూడా దొరకడం లేదని అన్నారు. యూరియా అందించడంలో అధికారులు లేనిపోని మాటలతో కాలం వెళ్లదీస్తున్నారని పేర్కొన్నారు. సుమారు అరగంట పాటు రాస్తారోకో కొనసాగగా రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పస్రా ఎస్సై సంఘటనా స్థలికి చేరుకుని నాయకులు, రైతులకు నచ్చజెప్పారు. ఉన్నతాధికారులతో మాట్లాడి రెండు, మూడు రోజుల్లో యూరియా అందించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో నిరసనకారులు శాంతించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అజ్మీరా సురేష్, ధరావత్ రాకేష్, రమేష్, ఓదెలు, మాలోత్ గాంధీ, రాజు, రైతులు పాల్గొన్నారు.

ఎరుకల అభ్యున్నతికి కృషి చేయాలి

- హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న వలిగి ప్రభాకర్

టేకుమట్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎరుకల జాతి అభ్యున్నతికి కృషి చేయాలని ఏకలవ్య ఎరుకల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు వలిగి ప్రభాకర్ అన్నారు. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల గ్రామంలో మండల అధ్యక్షుడు కేతిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఎరుకల స్వీయ గౌరవ పోరాట జెండా ఆవిష్కరణ కార్యక్రమం సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ఎరుకల జాతి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఎరుకల కులస్థులు దశాబ్దాలుగా గుంట భూమి లేక, జీవించడానికి కనీస వనరులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరాయి సాయిలు, నాయకుడు రేవెల్లి సదయ్య, జిల్లా అధ్యక్షుడు కేతిరి రమేష్, ప్రధాన కార్యదర్శి రేవెల్లి రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు మానుపాటి సదయ్య, మండల నాయకులు మానుపాటి రవి, దుగ్యాల సారయ్య, దుబ్యాల సమ్మయ్య, దుగ్యాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలకు జై..

- ఏటా ఉత్సవాల్లో పెరుగుతున్న ప్రతిమలు
- అధికారులు, స్వచ్ఛంద సంస్థల అవగాహనతో సత్ఫలితాలు



కలెక్టరేట్‌లో ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్



మానుకోటలో కూరగాయల అలంకరణలో మట్టి వినాయకుడు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం మహబూబాబాద్ జిల్లాలో మట్టి వినాయక విగ్రహాలకు భక్తులు జై కొడుతున్నారు. ఏటా గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మట్టి వినాయక విగ్రహాల ఏర్పాటు పెరుగుతూ వస్తోంది. వినాయక చవితి పండుగ సమీపిస్తుండగా స్వచ్ఛంద సంస్థలు, అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వల్ల జరిగే నష్టాలు, మట్టి వినాయక విగ్రహాలతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించడంతో ఉత్సవ నిర్వాహకులు మట్టి వినాయక విగ్రహాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో క్రమక్రమేనా ఏటా మట్టి వినాయక విగ్రహాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇళ్లలో పూర్తిగా మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోగా, మండపాల్లో అత్యధికంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు.

814 వినాయక విగ్రహాల ఏర్పాటు..

మహబూబాబాద్ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 18 మండలాల పరిధిలో చిన్నవి, పెద్దవి కలిపి మండపాల్లో 814 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇందులో అత్యధిక శాతం మట్టి వినాయక విగ్రహాలే దర్శనమిస్తున్నాయి. పండుగకు ముందుగా మునిసిపాలిటీల ఆధ్వర్యంలో పట్టణాల్లో ఇళ్లలో పూజ చేసుకునేందుకు చిన్న మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో పండుగకు ఒక్క రోజు ముందుగా ఏకంగా రెండు సెంటర్లలో 2,500 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఇక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పండుగ ముందు రోజు విద్యార్థులచే మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయించి వాటి ప్రాధాన్యత, పండుగ ప్రాచుర్యాన్ని వివరించారు. మరో పక్క పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో ఉద్యోగులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. మొత్తానికి ఓ పక్క అధికారులు, మరో పక్క స్వచ్ఛంద సంస్థల అవగాహనతో జిల్లాలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు తగ్గి మట్టి వినాయక విగ్రహాల సంఖ్య పెరిగి సత్ఫలితాలనిస్తోంది.

పట్టుబడిన వాహనాల వేలం

తొర్రూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు ఆదేశాల మేరకు వేలం పాట నిర్వహిస్తామని ఎక్సైజ్ సీఐ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 4న ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ద్విచక్ర, భారీ వాహనాలకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 8 గంటలకు స్టేషన్ వద్దకు వచ్చి 50 శాతం డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని, ప్రభుత్వ నిబంధనలమేరకు వేలం హిస్తామని పేర్కొన్నారు.

అమ్మఒడి వాహనం ఢీకొని ఒకరి మృతి



గణేష్ (ఫైల్)

గంగారం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మడగూడెం మూలమలుపు వద్ద ఆదివారం అమ్మఒడి వాహనం ఢీకొని గంగారానికి చెందిన జెజ్జరి గణేష్(35) మృతి చెందాడు. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం...మండలకేంద్రంలోని జజ్జరి గుంపుకు చెందిన జెజ్జరి గణేష్ మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై కొత్తగూడ వైపుకు బయలుదేరాడు. మడగూడెం మూలమలుపు వద్ద ఎదురుగా నర్సంపేట వైద్యశాల నుంచి గంగారానికి బాలింతలను తీసుకువస్తున్న అమ్మఒడి వాహనం జెజ్జరి గణేష్ బైకును ఢీకొనటంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. గణేష్‌కు భార్య అరుణ ఉన్నారు. తండ్రి సమ్మయ్య ఫిర్యాదు మేరకు శవ పంచనామా చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

- 8,19,500 క్యూసెక్కుల ప్రవాహం

మహదేవపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లాలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి ఆదివారం 8,19,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరింది. దీంతో మొత్తం 85 గేట్లు ఎత్తిన అధికారులు వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు పంపిస్తున్నారు.

ఉరి వేసుకొని మహిళ మృతి



యాకమ్మ (ఫైల్)

తొర్రూరు రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆర్థికపరమైన సమస్యలతో భర్తతో గొడవ పడిన భార్య డొంక యాకమ్మ(47) ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... తొర్రూరు మండలం చీకటాయపాలెం గ్రామానికి చెందిన డొంక యాకమ్మ భర్త వెంకన్నతో ప్రతి రోజు కూలీ పనులకు వెళ్లి డబ్బులు ఇవ్వడం లేదంటూ, తాగడంతో శనివారం ఇరువురు గొడవ పడ్డారు. దీంతో భార్యాభర్తల మధ్య జరిగిన వాగ్వాదంతో యాకమ్మ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు డొంక హేమంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రాజుల సొమ్ము రాళ్లపాలు

- నిరుపయోగంగా హరిత హోటల్
- ప్రారంభించకముందే శిథిలం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



హోటల్ గదిలో నిల్వ చేసిన సామాన్లు

మంగపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరులో నిర్మించిన హరిత హోటల్ నిరుపయోగంగా మారింది. బూర్గంపహాడ్-ఏటూరునాగారం ప్రధాన రహదారిపై డబుల్ బెడ్‌రూం సముదాయం పక్కన దీన్ని గత బీఆర్ఎస్ హయాంలో 2016లో రూ.6 కోట్ల 50 లక్షలతో నిర్మించారు. టొబాకో కంపెనీ ఆధీనంలో ఉన్న భూమిని యజమాని విడిచి వెళ్లడంతో కొందరు ఆక్రమించుకొనేందుకు యత్నించగా అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అజ్మీరా చందులాల్ చొరవతో పర్యాటకశాఖ స్వాధీనం చేసుకుంది. ఈస్థలంలో హరితహోటల్ భవన సముదాయాన్ని నిర్మించినా కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రారంభించలేదు. అప్పటి నుంచి ఈ భవనం నిరుపయోగంగా మారింది. కోట్లతో నిర్మించిన భవనంలో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది. అంతేకాకుండా కిటికీలు, దర్వాజాలతో పాటు ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడం, ఎత్తుకెళ్లడం లాంటి దుశ్చర్యలు సైతం రాత్రి వేళల్లో జరిగాయి. అలాగే కొందరు ఈ భవనాన్ని అనధికారికంగా గోదాంలావాడుకుంటున్నారు. గడ్డి బొద్దులు, స్క్రాప్‌ను నిల్వ చేస్తున్నారు. మరికొందరు ఈ భవనంలోని విద్యుత్‌ను వాడుకుంటున్నారని తెలుస్తోంది. విద్యుత్ పరికరాలను కూడా ఎత్తికెళ్లారు. హోటల్ భవనం నిరుపయోగంగా ఉండటంతో చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. భవనం లోపల టైల్స్ ధ్వంసమవుతున్నాయి. అంతేకాదు.. ఓవ్యక్తి ఈ భూమి తనదేనంటూ ఆక్రమించుకొనేందుకు యత్నిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు ఈ భవనాన్ని పట్టించుకోవడం లేదు. కోట్ల వెచ్చించి నిర్మించిన ఈ భవనం భూత్ బంగ్లాగా మారినా దాన్ని వినియోగంలోకి తేవడం లేదు. ఇప్పటికైనా హరిత హోటల్ భవనాన్ని ప్రభుత్వం పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



హరిత హోటల్ భవనం చుట్టూ పిచ్చిమొక్కలు

వాడకంలోకి తీసుకురావాలి



కోట్లతో నిర్మించిన హరిత హోటల్ భవన సముదాయాన్ని ప్రభుత్వం వాడకంలోకి తీసుకురావాలి. విలువైన భూములను రక్షించాలి. అధికారులు నిర్లక్ష్యం విడనాడాలి. విలువైన పరికరాలను తస్కరించిన వారిపై చర్యలు తీసుకోవాలి.

\- ఎల్.పి.ముత్యాలు, సీపీఎం నాయకుడు

వీరోచిత పోరాటాల గడ్డ జనగామ

- సెల్‌ఫోన్‌లే జీవితంగా యువత మారడం తగదు
- తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నందిని సిధారెడ్డి

జనగామ కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వీరోచిత పోరాటాల గడ్డ జనగామ అని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి అన్నారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలో నెల్లుట్ల అనసూయమ్మ, లక్ష్మారావు కళాపీఠం ఆరో వార్షికోత్సవం సందర్భంగా నెల్లుట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశిష్ట పురస్కారాలు అందుకున్న వారికి ఘన సన్మానం నిర్వహించారు.కార్యక్రమానికి ఫౌండేషన్ అధ్యక్షుడు నెల్లుట్ల రవీందర్‌రావు అధ్యక్షత వహించగా సిధారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జనగామ ప్రాంతంలో సాహిత్యానికి కొదవలేదన్నారు. తల్లిదండ్రుల పేరుతో పురస్కారాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. యువత సెల్‌ఫోన్‌లే జీవితంగా భావించడం మంచిది కాదన్నారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత గడ్డం సమ్మయ్య, జీవన సాఫల్య పురస్కార స్వీకర్త కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి, సాహిత్య పురస్కార స్వీకర్త లింగంపల్లి రామచంద్ర, సాహితీవేత్త నెల్లుట్ల రమాదేవి, విశిష్ట సేవా పురస్కార స్వీకర్త వేములవాడ రాజేష్‌చంద్ర, అక్షర సేవా పురస్కార స్వీకర్తలు ఎల్లాప్రగడ నిర్మల అమరేశ్వర్, వేముల సదానందంను సన్మానించారు. సామాజిక కవి జి.కృష్ణ, పోరెడ్డి రంగయ్య, పెట్లోజు సోమేశ్వరాచారి, అయిలా సోమనర్సింహాచారి, జనగామ శంకర్, పి.భాస్కర్, సాయికిరణ్ పాల్గొన్నారు.

10న మంత్రి సీతక్కకు కృతజ్ఞతా సభ

- సన్మానించనున్న ఎస్సీ ఉప కులాలు

ములుగుటౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప కులాల వర్గీకరణకు సహకరించిన రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు ఈ నెల 10న కృతజ్ఞతా సభను నిర్వహించనున్నట్టు కన్వీనర్ గడ్డం వెంకటేశ్వర్లు తెలిపారు. ములుగు జిల్లా కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఎస్సీ ఉపకులాలు చిందు, బేడబుడగ జంగం, మాస్టీన్, డక్కలి, గోసంగి, మిత్తల్ అయ్యార్ కులాల నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. కృతజ్ఞతా సభ సందర్భంగా మంత్రి సీతక్కను ఘనంగా సన్మానించనున్నట్టు తెలిపారు. ఎస్సీ కులాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో కోకన్వీనర్ తూర్పాటి కుమారస్వామి, కొయ్యడ రమేష్, రమేష్, కర్రెకంటి గోపాల్, దిక్కలి వెంకటాద్రి, గడ్డం రమేష్, చంద్ర, పున్నంచందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఒక తలపోతే రెండో తల పొందలేరు...!'

- వినాయక మండపం వద్ద వినూత్న ప్రచారం



కేసముద్రం ఉప్పరపల్లి రోడ్‌లో శ్రీసాక్షి గణపతి యూత్ సభ్యులు చేసిన రౌండ్ ఫ్లెక్సీ

వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతను తెలియజేసేందుకు యువకులు వినూత్నంగా ఆలోచించారు. కేసముద్రం స్టేషన్ ఉప్పరపల్లి రోడ్‌లో శ్రీసాక్షి గణపతి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద 'ఒక తలపోతే రెండో తల పొందలేరు.. నాలాగా, తలమీదే.. రక్షణ మీదే... హెల్మెట్ ధరించండి'అంటూ భారీరౌండ్ ఫ్లెక్సీపై వినూత్నంగా రాశారు. బాలగణేషుడు హెల్మెట్‌ను ఇస్తున్నట్లుగా ఫొటోను కూడా ముద్రించారు. సామాజిక స్పృహకు సృజనాత్మకతను జోడించి రూపొందించిన ఈ ఫ్లెక్సీ అటుగా వెళ్లిన వారిని ఆకట్టుకుంటోంది.

\- కేసముద్రం, ఆంధ్రజ్యోతి

బస్సు ప్రమాద ఘటనపై కేసు నమోదు

దంతాలపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై గల దంతాలపల్లి మండల కేంద్రంలో ఆగస్టు 30న జరిగిన ఘోర ప్రైవేటు బస్సు ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై రాజు మాట్లాడుతూ ఖమ్మం నుంచి హనుమకొండ వైపు వివాహ రిసెప్షన్ ముగించుకొని వస్తున్న ప్రైవేటు బస్సు మండలకేంద్రంలో భారీ గుంతను తప్పించబోయి ఓ ఇంట్లోకి దూసుకెళ్లిందన్నారు. ఈ క్రమంలో మండల కేంద్రానికి చెందిన తూర్పాటి ఎలమంచి రేకుల ఇల్లు పూర్తిగా ధ్వంసమైందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా మండలం ఎల్కతుర్తి, సురారానికి చెందిన బస్సు డ్రైవర్ బుసమల్ల దేవరాజు(30) అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడు దేవరాజు భార్య బుసమల్ల శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దేవరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు. బస్సు క్లీనర్ మూల శంకర్‌కు స్వల్ప గాయాలయ్యాయన్నారు. బస్సులో ఉన్న వారందరు క్షేమంగానే ఉన్నారని తెలిపారు. హైవే రోడ్డుపై ఏర్పడ్డ భారీ గుంతలపై సంబంధించిన శాఖ అధికారులకు నివేదికను పంపిస్తామన్నారు.



ధ్వంసమైన ఎలమంచి రేకుల ఇల్లు

రెట్టింపైన కూరగాయల ధరలు

- వినాయక చవితికి ముందు సాధారణ రేట్లు
- నవరాత్రి ఉత్సవాల్లో శాఖాహారం, అన్నదానాల ప్రభావం

కేసముద్రం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల్లో ఒకటైన కూరగాయల ధరలు ఒక్కరోజు వ్యవధిలోనే రెట్టింపు కావడం పేద, మధ్య తరగతి వర్గాలకు ఆర్థిక భారంగా మారాయి. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో వినాయక నిమజ్జనం అయ్యేంత వరకు అధిక మంది శాఖాహారం భుజించడంతోపాటు మండపాల వద్ద అన్నదానాలు, శాకాంబరుడి అలంకరణలతో కూరగాయల వినియోగం విపరీతంగా పెరిగింది. దానికి డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయల సప్లై పెరగకపోవడంతో సహజ ఆర్థిక సూత్రాల ప్రకారం వినాయక చవితికి ముందురోజు ఉన్న ధరలు ఆ తర్వాతి రోజునే అమాంతం పెరిగాయి. నిన్నమొన్నటి వరకు రూ.20లకే కిలో కొనుగోలు చేసిన కూరగాయలను రూ.40లకు పెట్టాల్సివస్తోందని పలువురు వాపోతున్నారు. సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజలు పెరిగిన ధరలతో కూరగాయలకు అధికంగా వెచ్చించాల్సి వస్తోంది.

రిటైల్ మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలోకు..

కూరగాయలు	వినాయక చవితికి ముందు	తర్వాత రోజు నుంచి
టమాట	రూ.20 నుంచి 30 వరకు	రూ.40 నుంచి 50 వరకు
వంకాయ	రూ.20 నుంచి 30 వరకు	రూ.50 నుంచి 70 వరకు
సోరకాయ	రూ.10 నుంచి 20 వరకు	రూ.40 నుంచి 50 వరకు
దోసకాయ	రూ.20 నుంచి 30 వరకు	రూ.40 నుంచి 50 వరకు
మునగకాయలు	రూ.30 నుంచి 40 వరకు	రూ.90 నుంచి 100 వరకు
దొండకాయ	రూ.20 నుంచి 30 వరకు	రూ.50 నుంచి 60 వరకు
బీరకాయ	రూ.30 నుంచి 40 వరకు	రూ.50 నుంచి 60 వరకు
కొత్తిమీర	రూ.50 నుంచి 60 వరకు	రూ.100నుంచి 120 వరకు



కేసముద్రంలోని కూరగాయల దుకాణంలో కొత్తిమీర విక్రయిస్తున్న మహిళ

మండపంలో చెలరేగిన మంటలు

జనగామ రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలోని వినాయక మండపంలో ఆదివారం మంటలు చెలరేగాయి. కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని దుర్గానగర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో వెలిగించిన దీపం వలన డెకరేషన్ క్లాత్ అంటుకోని మంటలు వ్యాపించగా కొంత వినాయక విగ్రహం కాలిపోయింది. నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసుల చేరుకోని ఫైర్ ఇంజన్ ద్వారా మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.



మంటలను అదుపు చేసిన అధికారులు



సంచార జాతుల విముక్తి దినోత్సవంలో పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్

కనుమరుగవుతున్న సంచార జాతుల కళలు

» ప్రధాని మోదీ ఆదేశాలతో విముక్తి దినోత్సవం: కె.లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల విన్యాసాలు, హరి కథలు, బుర్ర కథలు వంటి సంప్రదాయ కళలు అంతరించిపోవడం దురదృష్టకరమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్య కేంద్రంలో నిర్వహించిన సంచార జాతుల విముక్తి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడారు. ప్రధాన మోదీ సంచార జాతుల విముక్తి దినోత్సవ ప్రాముఖ్యతను గుర్తించి, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అధికారికంగా ఈ వేడుకను జరపాలని ఆదేశించారని తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. తాను 1999లో మొదటిసారి శాసన సభ్యుడిగా ఎన్నికైనప్పుడు అసెంబ్లీలో సంచార జాతుల సమస్యలను ప్రస్తావించానని గుర్తు చేశారు. ఆ తర్వాతే అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సంఘాలతో మాట్లాడి కులాల పేర్లను అధికారికంగా మార్చారని పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ చేసిన కుల గణన ఓటు బ్యాంకు దృష్టితో జరిగిందని, అందులో బీసీలకు, అణగారిన వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. కులాల వారీ లెక్కలు అధికారికంగా రావాలంటే కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగే గణన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సంచార జాతుల్లో కులాల లెక్కలు అధికారికంగా తేలితే బడ్జెట్ కేటాయింపులు, అభివృద్ధి ప్రణాళికలను స్పష్టంగా అమలు చేయవచ్చని లక్ష్మణ్ అన్నారు.

వివరణ ఇచ్చేందుకు 10 రోజుల గడువు ఇవ్వండి

» స్పీకర్‌ను కలిసి కోరిన కడియం, అరికెపూడి, దానం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు మేరకు జారీ చేసిన నోటీసులపై విచారణకు హాజరై వివరణ ఇచ్చేందుకు తమకు పది రోజుల గడువు ఇవ్వాలంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్ కోరారు. అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో ఆదివారం ఆయన్ను కలిసిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మిగిలిన ఎమ్మెల్యేలూ స్పీకర్‌ను కలిసి గడువు కోరనున్నట్లు తెలుస్తోంది. అనంతరం అసెంబ్లీ లాబీల్లో కడియం, అరికెపూడి గాంధీ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. తాము వివరణ ఇచ్చేందుకు స్పీకర్‌ను పది రోజులు గడువు ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. కాగా.. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి మారిన పది మంది ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలంటూ గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు ఇచ్చిన బీఆర్ఎస్.. ఈ అంశంపైన సుప్రీం కోర్టునూ ఆశ్రయించగా.. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇందులో భాగంగానే పది మంది ఎమ్మెల్యేలకూ స్పీకర్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది.

ఆర్ఎఫ్‌సీఎల్ లో లీకేజీలకు ఎవరిది బాధ్యత..?

» రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్)లో అమ్మోనియా పైప్‌లైన్ వరుస లీకేజీలకు బాధ్యత ఎవరిదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రశ్నించారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం నిర్మిస్తే రాష్ట్ర రైతాంగానికి యూరియా సకాలంలో అందుతుందని యూపీఏ ప్రభుత్వం ప్లాంట్ నిర్మాణానికి అనుమతినిచ్చిందని తెలిపారు. ప్లాంటు అవసరాలకు మిషన్ భగిరథ నీరు ఇస్తున్నామని, ఉత్పత్తిలో 50శాతం యూరియాను తెలంగాణకు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచే ఈ సీజన్లో రాష్ట్రానికి రావాల్సిన 1.2లక్షల టన్నుల యూరియాను తగ్గించారన్నారు. ప్లాంట్‌లో నిర్మాణలోపాలు, అధికారుల నిర్లక్ష్యంపై సీబీఐతో విచారణ జరిపించాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు.

కేటీఆర్.. ఓ మానసిక రోగి

ఉపరాష్ట్రపతి ఎన్నికకు యూరియాకు ఏం సంబంధం?.. ఎన్డీఏ అభ్యర్థికే ఓటేస్తామని చెప్పొచ్చుగా?

» నాపై 181 కేసులు బనాయించారు
» ఇల్లు కూల్చేశారు..నన్ను కిడ్నాప్ చేశారు
» చంద్రబాబుతో సంప్రదింపులు అబద్ధం
» 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని
» 'ఇండియా టుడే' ఇంటర్వ్యూలో రేవంత్



న్యూఢిల్లీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక మానసిక రోగి అని, యూరియా ఇస్తేనే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామనడం పిచ్చికి పరాకాష్ట అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అనవసరంగా ఇలాంటి నాటకాలు ఎందుకని, ఎన్డీఏ అభ్యర్థికి మద్దతిస్తామని కేటీఆర్ చెప్పవచ్చు కదాని పేర్కొన్నారు. యూరియా ఇచ్చేది కేంద్రమని, అలాంటప్పుడు యూరియా ఇస్తేనే ఇండి కూటమి అభ్యర్థికి మద్దతు ఇస్తామని ఎలా అంటున్నారని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో తనపై అక్రమంగా 181 కేసులు బనాయించారని, ఆ కేసులే తనకు మెడల్స్ అని చెప్పారు. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, గుజరాత్.. ఇలా అనేక రాష్ట్రాల్లో తెలుగు మాట్లాడే ఎంపీలు ఉన్నారని, వారంతా కలసి సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇటీవల సీఎం రేవంత్‌ను ఇండియా టుడే ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది. అందులో రేవంత్ ఆసక్తికర అంశాలను వెల్లడించారు.

బీఆర్ఎస్ పతనావస్థకు చేరింది..

గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవ దానం చేసి బీజేపీని 8 సీట్లలో గెలిపించిందని రేవంత్ చెప్పారు. బీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి ఒక్క పార్లమెంట్ సీటైనా గెలిచిందని, ఇప్పుడు ఘోరంగా పతనావస్థకు చేరిందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్‌లోనూ బీజేపీనే గెలిచిందన్నారు.

కేసులతో ఖతం చేయాలని చూశారు..

ప్రజల కోసం ప్రశ్నించిన ప్రతిసారి తనపై కేసులు పెట్టారని, అలా కేసులు పెట్టిన ప్రతిసారీ తనకు ప్రజల్లో మద్దతు పెరిగిందని రేవంత్ చెప్పారు. "నాపై 181 అక్రమ కేసులు పెట్టారు. ఎప్పటికైనా తన ప్రత్యర్థిని నేనేనని కేసీఆర్‌కు తెలుసు. అందుకే నన్ను హింసించేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. నాపై క్రిమినల్ కేసులు పెట్టి ఖతం చేయాలని చూశారు. ఎన్నికల సమయంలో నా ఇల్లు కూల్చేశారు. నన్ను కిడ్నాప్ చేశారు. మూడు నెలలకే ఎంపీగా గెలిచి ఢిల్లీకి వచ్చా. ఈ రోజు సీఎం అయ్యా" అని తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆ బిల్లు..

ఏదైనా కేసులో అరెస్టయి 30 రోజులకుపైగా జైలులో ఉన్న సీఎంలు, మంత్రులను పదవి నుంచి తప్పించే బిల్లును రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకే దానిని తీసుకువచ్చారని ఆరోపించారు. "ప్రస్తుతం విపక్ష సీఎంలను టార్గెట్ చేసి కేసులు పెట్టడం చూస్తున్నాం. చిన్న అంశాల్లోనూ 30 రోజులు జైల్లో పెట్టొచ్చు. ఇదేమీ అంత పెద్ద విషయం కాదు. కొత్త బిల్లు చట్టంగా మారాక ఢిల్లీ ఆదేశాలను అమలు చేయకపోతే.. రాష్ట్రాల సీఎంలు ఎవరైనా పదవి వదులుకోవాల్సి వస్తుంది. ఈ అంశంపై యోగి ఆదిత్యనాథ్ సహా బీజేపీ సీఎంలే ఆందోళన చెందుతుంటే.. మిగతా సీఎంల పరిస్థితి ఏమిటి?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అలాగని తానేమీ భయపడటం లేదని, తానెలాంటి తప్పు చేయలేదని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి మద్దతివ్వకపోతే ఖతం చేయడమే వాళ్లకు తెలుసని ఆరోపించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై అమిత్‌షా వ్యాఖ్యలు అత్యంత దారుణమని మండిపడ్డారు.

చంద్రబాబుతో సంప్రదింపులు అవాస్తవం

2024లో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటు సమయంలో చంద్రబాబుతో తాను సంప్రదింపులు జరిపాననేది అవాస్తవ ప్రచారమని రేవంత్ స్పష్టం చేశారు. తానెప్పుడూ అటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. అలాంటి రాజకీయాలను రాహుల్ గాంధీ విశ్వసించరని.. ఆయన అలా అనుకుంటే ఎప్పుడో ప్రధాని అయ్యేవారని చెప్పారు. చంద్రబాబు సీనియర్ రాజకీయవేత్త అని, రాజకీయ ఎత్తుగడల్లో ఆయనకు మించిన వారెవరూ లేరని పేర్కొన్నారు. చంద్రబాబును తాను గౌరవిస్తానని, కానీ తనకు పార్టీ, తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. తన రాజకీయ అంచనాలు ఎప్పుడూ తప్పలేదని.. 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని అని, కావాలంటే రాసిపెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రధాని మోదీకి 2029 ఎక్స్‌పైరీ తేదీ అన్నారు. తాను బీజేపీలో పనిచేయలేదని, ఏబీవీపీలో పనిచేశానని.. బీజేపీ రాజకీయ పార్టీ అని, ఏబీవీపీ విద్యార్థి సంఘమని వివరించారు. తాను ఇప్పుడు కాంగ్రెస్ యూనివర్సిటీలో ఉన్నానని చెప్పారు.

ముందు ప్రేమించా.. సినిమా స్టైల్లో పెళ్లి జరిగింది..

తన ప్రేమ, వివాహంపై రేవంత్ ఆసక్తికర విషయాలు తెలిపారు. "నాది పెద్దలు చేసిన ప్రేమ వివాహం. ముందు నేను ప్రేమించాను. తర్వాత అది అరేంజ్ మ్యారేజ్‌గా మారింది. నా భార్య గీత ఢిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీలో చదువుకుంది. నేను తెలంగాణలో ప్రభుత్వ బడిలో చదువుకున్నాను. మా పరిచయం ఊహించని విధంగా జరిగింది. విజయవాడలో వాజ్‌పేయి సభ జరిగింది. కొందరితో కలసి నేను హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాను. తిరిగి వచ్చే క్రమంలో గీత కుటుంబంతో కలిసి నాగార్జున సాగర్‌లో ఆగాం. అక్కడ గీతతో పరిచయం జరిగింది. అది ప్రేమగా మారింది. చివరికి సినిమా స్టైల్‌లో మా పెళ్లి జరిగింది. టైం దొరికితే మనవడితో ఎంజాయ్ చేస్తా" అని చెప్పారు.

ఒక్కసారి కూడా సిగరెట్ తాగలే..

జీవితంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా తాను సిగరెట్ తాగలేదని, అది తన విల్ పవర్ అని రేవంత్ చెప్పారు. తాను టీ కూడా తాగేవాడిని కాదని.. విద్యార్థి ఉద్యమాల్లోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో అలవాటైందని తెలిపారు. తాను ఫుట్‌బాల్ ఆటగాడినని, రాహుల్ గాంధీ దగ్గర సమయం దొరికినప్పుడల్లా.. ఫిట్‌నెస్‌పై సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు.

ఓటుహక్కును కొల్లగొడుతున్న మోదీ

18 ఏళ్లకు ఓటుహక్కు కల్పించిన రాజీవ్‌గాంధీ.. దానిని కాపాడుకునేందుకు కలిసికట్టుగా పోరాడదాం

» 2029 రాహుల్ ప్రధాని అయ్యే సంవత్సరంగా చాటుదాం
» 21 ఏళ్లకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలి : రేవంత్‌రెడ్డి
» కేరళలో పాంథువల్ మెరిట్ అవార్డుల ప్రదానోత్సావానికి హాజరు



విద్యార్థినికి పాంథువల్ మెరిట్ అవార్డు అందజేస్తున్న కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశంలో 18ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికీ ఓటుహక్కు కల్పించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ మాత్రం పౌరుల నుంచి ఓటుహక్కును కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ప్రతి భారతీయుడి ఓటుహక్కును కాపాడి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు అందరం కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. 18ఏళ్లకు ఓటు హక్కు కల్పించిన వారికి, ఓటు హక్కును కొల్లగొట్టిన వారికి మధ్యే 2029 ఎన్నికలు జరగబోతున్నాయని తెలిపారు. 2029ని రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే సంవత్సరంగా చాటుదామన్నారు. ఆదివారం కేరళలోని అలప్పుళలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన పాంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డుల కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీ వేణుగోపాల్ ప్రారంభించిన ఈ అవార్డులు పది, పన్నెండు తరగతుల్లోని విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేస్తున్నామని, పేదలకు నాణ్యమైన విద్యనందించాలని సంకల్పించామని తెలిపారు. 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. రాష్ట్రంలో యంగ్‌ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వయసును 21ఏళ్లకు తగ్గిస్తూ రాజ్యాంగాన్ని సవరించుకోవాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ కేవలం యువత శక్తిని నమ్ముకుని పోరాటం సాగిస్తోందన్నారు.

ఆగస్టులో రికార్డు వానలు

» సాధారణం కంటే 75% అధిక వర్ష పాతం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగస్టులో సాధారణం కంటే 75శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 21.5సెం.మీ పడాల్సి ఉండగా.. 37.85 సెం.మీ కురిసింది. అంటే రోజుకు సగటున 1.2 సెం.మీ. వాన పడింది. గత ఏడాదితో సగటు పోల్చితే ఈసారి 80శాతం అధిక వర్షపాతం నమోదైంది. కాగా, ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు సాధారణ వర్షపాతం 57.3సెం.మీ నమోదు కావాలి. అయితే ఇప్పటి వరకు 72 సెం.మీ వర్షం కురిసింది. అంటే 26శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 621 మండలాలుండగా.. 136 చోట్ల అత్యధిక (60% ఎక్కువగా), 238 చోట్ల అధిక (20-59శాతం మధ్య), 221 మండలాల్లో సాధారణ వర్షపాతం, మరో 26 మండలాల్లో 20-60శాతం లోటు వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 104 సెం.మీ పడింది. కాగా, రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

సర్కార్ బడుల్లో

మళ్లీ రాగి జావ

ఉమ్మడి జిల్లాలో 5.50 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

» ఎట్టకేలకు పునరుద్ధరించిన ప్రభుత్వం
» సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్‌కు బాధ్యతలు



హనుమకొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సర్కార్ బడుల్లో విద్యార్థులకు రాగి జావ అందించే కార్యక్రమం పునఃప్రారంభం కానున్నది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. గత ఏడాది అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం విద్యార్థులకు అల్పాహారంగా రాగిజావను అందించింది. ఉదయం ఏమి తినకుండానే హడావుడిగా పాఠశాల విద్యార్థులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. కానీ ఈ ఏడాది ఈ కార్యక్రమం ఇప్పటి వరకు ప్రారంభం కాపోడంతో ఇక రాగి జావ సరఫరా ఉండదేమోనని భావించారు.

గ్రామీణ విద్యార్థులకు మేలు

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు ఉదయమే పొలం పనులకు వెళుతుంటారు. వారి పిల్లలు ఉదయం 9.15 గంటలకు ప్రారంభమయ్యే బడికి హజరయ్యేందుకు వీలుగా 7 గంటలకే ఇంటి నుంచి ఏమీ తినకుండా బయలుదేరుతారు. పాఠశాలలో ఒంటి గంటకు అందించే మధ్యాహ్న భోజనం వరకు ఖాళీ కడుపుతోనే చదువుకోవలసి వస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకొని రెండేళ్ల నుంచి ప్రభుత్వం విద్యార్థులకు రాగి జావాను అందించడంతో వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రారంభంకాకపోవడంతో విద్యార్థులు ఉదయం ఖాళీ కడుపుతోనే పాఠాలు వింటున్నారు. విద్యార్థులకు ఉదయం వేళ పోషక విలువలతో కూడిన ఆహారం అందించడమే లక్ష్యంగా 2023లో పీఎం పోషణ్ ద్వారా ప్రభుత్వ బడుల్లో రాగిజావ పంపిణీని ప్రారంభించారు. గత ఏడాది ఏప్రిల్ వరకు ఈ కార్యక్రమం విజయవంతంగా అమలైంది. కానీ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నుంచి బడులకు అందాల్సిన రాగిపిండి, బెల్లం సరఫరా కాలేదు. దీనితో పథకం ఆగిపోయింది. విద్యార్థులు ఉదయం పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

5.50 లక్షల మందికి లబ్ధి

ఉమ్మడి జిల్లాలో 5600 ప్రభుత్వ బడులు ఉండగా సుమారు 5.50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి రోజు మధ్యాహ్నం భోజనం, వారంలో మూడు రోజులు కోడిగుడ్లు అందిస్తున్నారు. అయితే మరో మూడు రోజులు ఉదయం రాగి జావ అందించేవారు. దీనిని తయారీకి అవసరమైన రాగిపిండి, బెల్లం కేటాయించేవారు. దీంతో విద్యార్థులకు ఆకలి దూరం కావడంతోపాటు పోషకాలు అందుతాయి. బాలికలకైతే మరింత ఉపయుక్తమని వైద్య నిపుణులు సైతం పేర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావను తిరిగి పంపిణీ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

వారానికి మూడు రోజులు

ఇక ప్రభుత్వ పాఠశాలల్లో వారానికి మూడు రోజులు విద్యార్థులకు ఈ రాగిజావను అందిస్తారు. ఇందుకు అవసరమైన రాగి పిండి, బెల్లం పొడిని సరఫరా చేసే బాధ్యతను శ్రీ సత్యసాయి అన్న పూర్ణ ట్రస్ట్‌కు ప్రభుత్వం అప్పగించింది. ప్రతీ విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, 10 గ్రాముల బెల్లం పొడి చొప్పున పాఠశాలలకు ట్రస్ట్ సరఫరా చేయనున్నది. ట్రస్ట్ సహకారంతో రెండేళ్లపాటు పాఠశాలలకు రాగి జావా పంపిణీ కొనసాగుతుంది. ఈ కార్యక్రమానికి అయ్యే వ్యయంలో 40 శాతం ప్రభుత్వం భరించాలని ట్రస్ట్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేసింది. రాగి జావను వడ్డించే బాధ్యతను ఇప్పటికే మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్న మధ్యాహ్నం భోజనం వండే కార్మికులకు అప్పగించింది. అదనంగా రాగి జావ వండినందుకు రోజుకు 25పైసల చొప్పున ప్రభుత్వం వారికి ప్రోత్సాహకంగా అందించనున్నది.

ఫంక్షన్‌హాళ్ల దోపిడీపై నియంత్రణేది ?

● అన్నింటా కమీషన్లే.. ● అడ్డగోలుగా దండుకుంటున్న యాజమాన్యాలు



బాలసముద్రం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల తల్లిదండ్రులు కూతుర్లకు పెళ్లి చేయాలంటే సమరానికి సన్నద్ధం కావాల్సిందే. కట్నకానుకలు, బంగారం, మగపెళ్లి వారి గొంతెమ్మ కోరికలన్నీ తీర్చాలి. అల్లుడు అలకపాన్పు ఎక్కకుండా అన్ని సమకూర్చాలి. ఇరువర్గాలు పెళ్లికి సుముహూర్తం నిర్ణయించుకున్నాక మొదటగా ఫంక్షన్‌హాల్ బుక్ చేసుకునేందుకు సమాయత్తం కావాలి. ఫంక్షన్‌హాల్ అద్దె వారి తాహతును బట్టి రూ. 50 వేలు మొదలుకొని రూ. 2 లక్షల కంటే ఎక్కువగానే ఉంటుంది. అప్పటి నుంచి ఇక అసలు కథ మొదలవుతుంది. ఫంక్షన్‌హాల్‌లో అడుగు పెట్టగానే పెళ్లి పందిరి వేసే వారితో డబ్బుల కోసం డిమాండ్ చేయడం ప్రారంభమవుతోంది. ఫంక్షన్‌హాల్‌కు చెల్లించాల్సిన అద్దె ఎంతో పెళ్లి పందిరి అలంకరణ ఖర్చు దాదాపుగా అంతే ఉంటుంది. ఇదేంటయ్యా ? అంటే అది అంతే ఉంటుంది సార్ అంటున్నారు. తమకు వచ్చే ఆదాయంలో సగం ఫంక్షన్‌హాల్ యాజమాన్యానికి తాము కమీషన్ ఇవ్వాలని ఉంటుందని చెబుతున్నారు. అంతేగాక ఇద్దరు లేక ముగ్గురు సన్నాయి ఊదేవాళ్లు రూ. 20వేలు అడుగుతారు. అందులో కూడా సగం ఫంక్షన్‌హాల్ యాజమాన్యానికే కమిషన్‌గా చెల్లించాల్సి ఉంటుందట. ఇంకా ఫంక్షన్‌హాల్‌లో పనిచేసే లేబర్, సిబ్బందికి తినుబండారాలను వడ్డించే వెయిటర్లు, ఈవెంట్ నిర్వహించే వారికి చెల్లించే మొత్తం నుంచి కూడా ఫంక్షన్ హాల్ యాజమాన్యానికి సగం చెల్లించాలట. ఇలా ఆడపిల్ల తండ్రిని బలిపశువును చేస్తూ అందరూ పైసల కోసం పీక్కు తింటున్నారు. ఇది చాలదన్నట్లుగా మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు పేరుకే పొత్తుల పెళ్లి అంటారు. ఒక ఫంక్షన్‌హాల్ ఖర్చులో మాత్రమే మగ పెళ్లి వారు సగం భరిస్తారు. పెళ్లి పందిరి, ఇతర అలంకరణ తదితర ఖర్చులన్నీ అమ్మాయి తల్లిదండ్రులే భరించాలి. ఫంక్షన్ హాళ్లలో పెళ్లి ఖరీదైనదిగా మారింది. దీనికంతటికి కారణం ఫంక్షన్‌హాళ్ల యాజమాన్యాలు పెళ్లి తంతులో పాల్గొనే అందరి నుంచి కమీషన్లు దండుకోవడమేనని పలువురు ఆరోపిస్తున్నారు.

- ధరలను నియంత్రించాలి

వివాహాలు, శుభకార్యాల నిర్వహణలో నేడు ఫంక్షన్ హాళ్లు కీలకపాత్ర వహిస్తున్నాయి. వాటి ధరలు సామాన్య, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారాయి. ఫంక్షన్ హాళ్ల యాజమాన్యాలు అధిక ధరలు వసూలు చేస్తున్నాయి. అవి ప్రజలకు ఆర్థిక భారంగా మారాయి. వాటి రేట్లను నియంత్రించాలి.

-మండల పరశురాములు, సామాజికవేత్త వరంగల్

రామకోటి రాసిన భక్తుడి హఠాన్మరణం



చంద్రారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామ పెద్దలు, సత్సంగ్ సభ్యులు

నంగెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాట్రపల్లి గ్రామంలో రామకోటి రాసిన గాయపు చంద్రారెడ్డి గుండెపోటుతో హఠాన్మరణం చెందడం పట్ల గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోటి 5 లక్షల శ్రీరామ నామాలను లిఖించి భద్రాచలం రామచంద్ర స్వామి దేవాలయంలో ఆయన పుస్తకాలను సమర్పించారు. గ్రామంలో ఎవరు కనిపించినా జై శ్రీరాం అని పలుకరించే ఆయన ఆకస్మికంగా అసువులు బాయడం గ్రామస్థులకు ఆవేదన మిగిల్చింది. నిత్యం రామనామ స్మరణతో ప్రతిరోజూ గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రదక్షిణ చేసి స్వామిని ఆయన దర్శించుకునేవారు.

సుమారు 35 ఏళ్ల కిందట గ్రామంలో స్థాపించిన సుందర సత్సంగ్ శాఖలో ఆయన చురుకుగా పాల్గొనేవారు. ప్రతీ ఏటా శ్రీరామ నవమి రోజున గ్రామంలో నిర్వహించే సీతారాముల కల్యాణంలో ఆయన సీతారాములకు పట్టు వస్త్రాలను సమర్పించేవారు. ప్రతీ శనివారం ఆలయంలో ఇతర భక్తులతో కలిసి భజన కార్యక్రమంలో పాల్గొనేవారు. ఆయన మృతి పట్ల ఆవేదన చెందిన గ్రామ సత్సంగ్ శాఖ సభ్యులు, మాతలు, గ్రామ ప్రముఖులు ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి సుమారు గంట సేపు భజన కార్యక్రమం నిర్వహించారు. చంద్రా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన లేని లోటును పూడ్చేందుకు గ్రామంలో భక్తి కార్యక్రమాలను నిర్వహిస్తామని సీతారామచంద్రస్వామి దేవాలయ చైర్మన్ గురు స్వామి గోగుల రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆలయ పూజారి కొడకండ్ల శ్రీనివాసాచార్యులు, గ్రామ ప్రముఖులు, సత్సంగ్ శాఖ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

తాగునీరు, వృథా నీటి శుద్ధి తదితర సౌకర్యాలతో పాటు ఉత్పత్తి చేసిన వస్త్రాల డిజైనర్లు, దుస్తుల తయారీదారులు, ఇంక్యుబేషన్ సెంటర్లకు ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలు కల్పించాల్సి ఉంటుందని, కామన్ ప్రాసెసింగ్ ఫెసిలిటీ, కామన్ ఎఫ్లుయెంట్, ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ), కార్మికులకు వసతి సదుపాయం, ఆరోగ్య సౌకర్యాలు, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రం, వేర్‌హౌసింగ్, లాజిస్టిక్స్ వంటి అదనపు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. కంపెనీలకు స్థలాల కేటాయింపు సైతం స్పెషల్ పర్పస్ వెహికిల్(ఎస్‌పీవీ) ఆధ్వర్యంలో చేపట్టాల్సి ఉంటుందని తెలిపింది. ఈ మార్గదర్శకాలను అమలు చేస్తే మూడు విడతల్లో వెయ్యి కోట్ల నిధులు కేంద్రం గ్రాంట్‌గా అందిస్తుంది. అంతేకాకుండా ఈ పార్కులో ఏర్పాటు చేసే కంపెనీలకు భారీగా సబ్సిడీలు ఇస్తుంది. అయితే ఇప్పటికే భూ సేకరణతో పాటు కంపెనీలతో ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుంది. దీంతో పీఎం మిత్రను అమలు చేసేందుకు సాధ్యం కాదని కేంద్రం వాదించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి ఒత్తిడి తీసుకువచ్చారు. టెక్స్‌టైల్ పార్కులో భూ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. ఆస్పత్రి నిర్మాణంతో పాటు వరంగల్ నుంచి బస్సు సౌకర్యం కల్పించారు. వరద కాలువ నిర్మాణం, సీసీ రోడ్డు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయల కోసం ప్రభుత్వం ఇటీవల సుమారు రూ.500కోట్ల వరకు నిధులు విడుదల చేసింది. దీంతో వస్త్రనగరి అభివృద్ధికి అడుగులు పడటంతో పాటు కేంద్ర ప్రభుత్వం దృష్టిని ఆకర్షించింది.

కేఎంటీపీలో 2లక్షల మందికి ఉపాధి

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెడుతోంది. సీఎంగా రేవంత్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టిన తరువాత గత ఏడాది జూన్ 29న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును సందర్శించి, పెట్టుబడులు రాకపోవడానికి కారణాలపై సమీక్షించారు. ఆ తర్వాత ఆగస్టు 12వ తేదీన దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో జరిగిన పలు గ్లోబల్ కంపెనీలు, బిజినెస్ గ్రూపులతో సమావేశం నిర్వహించి టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులను ఆహ్వానించారు. ఆ తరువాత ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి పలుమార్లు పీఎం మిత్ర పథకంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును చేర్చాలని విజ్ఞప్తి చేశారు. పైగా పీఎం మిత్ర పథకాన్ని 2020-21 నుంచి ఏడేళ్ల కాలంలో అంటే 2027-28లో పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర జౌళిశాఖ వరంగల్ వస్త్రనగరిపై సానుకూలత వ్యక్తం చేసింది. గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టుగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది. అయితే ఇప్పటికే భూసేకరణతో పాటు రెండు కంపెనీల ఉత్పత్తి కూడా చేపట్టిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేసే అవకాశం ఉంది. బ్రౌన్ ఫీల్డ్ కింద చేపడితే కొంత గ్రాంట్ తగ్గే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

కాగా, ఇప్పటికే కేంద్ర జౌళిశాఖ అధికారులు పలుమార్లు వరంగల్‌లోని టెక్స్‌టైల్ పార్కును సందర్శించారు. ఇక్కడ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఉన్న సౌకర్యాలు, రవాణా తదితర వాటిపై సమీక్షించారు. ప్రపంచవ్యాప్తంగా కొత్త కంపెనీలతో పాటు వస్త్రాల తయారీ యూనిట్లు పెరుగనున్నాయి. దీంతో వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు పెరుగనున్నాయి. ఇటీవల కిటెక్స్ కంపెనీ 25వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు చేపట్టింది. దీంతోపాటు కొత్తగా వచ్చే అనేక కంపెనీలు ఉద్యోగాలను సృష్టించనున్నాయి. అంతేకాకుండా పరోక్షంగా స్థానికులకు భారీగా ఉపాధి అవకాశాలు రానున్నాయి. మొత్తంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో రెండు లక్షల మందికి పైగా ఉద్యోగ, ఉపాధిని పొందే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాలకు, దేశాలకు వస్త్రాలు, ముడి సరుకులను వరంగల్ నుంచి ఎగుమతులు చేసే అవకాశాలు వస్తాయనే చర్చ జరుగుతోంది.

బస్తాల కోసం జాగారం

● రైతువేదిక వద్ద వందల సంఖ్యలో రైతులు



రైతు వేదిక వద్ద బారులుతీరిన రైతులు

కేసముద్రం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : యూరియా బస్తాల కోసం ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు కేసముద్రం రైతువేదిక ఎదుట రైతులు నిద్రాహారాలు మాని జాగారం చేశారు. సోమవారం ఉదయం యూరియా టోకెన్లు ఇస్తారని ముందుగానే వ్యవసాయాధికారులు ప్రకటించడంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 500 మంది రైతులు రైతువేదిక వద్దకు వచ్చారు. ముందస్తుగా రైతువేదిక వద్ద క్యూలైన్ల కోసం బారికేడ్లు ఏర్పాటు చేయగా అందులోనే రైతులు నిల్చున్నారు. రైతు వేదిక నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు రాత్రంతా అలాగే క్యూలైనులో తెల్లవారుజాము వరకు నిల్చొని ఉండడం గమనార్హం. రైతులతోపాటు పోలీసులు కూడా జాగారం చేస్తూ బందోబస్తు నిర్వహించారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

కేసముద్రం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : బీహార్ దర్భంగాలో ఓటర్ అధికార్ యాత్ర సందర్భంగా ప్రధాని మోదీ, ఆయన తల్లిపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్, ఆర్‌జేడీ నేతలు రాహుల్‌గాంధీ, తేజస్వియాదవ్‌ల దిష్టిబొమ్మను కేసముద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ మాట్లాడారు ప్రధాని, ఆయన తల్లిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను మండల పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. రాహుల్‌గాంధీ, తేజస్వియాదవ్‌కు దేశ ప్రజలకు, తల్లుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి బోగోజు నాగేశ్వరాచారి, జిల్లా నాయకులు వోలం శ్రీనివాస్, రామడుగు వెంకటాచారి, నాగనబోయిన చంద్రకళ, చెలగొల వెంకటేష్, పూర్ణకంటి భాస్కర్, బొల్లోజు వీరన్న, సింగంశెట్టి మధుకర్, మల్యాల రాములు, నరేష్, యాకాంబ్రం పాల్గొన్నారు.

● మరిపెడ : నరేంద్రమోదీ తల్లి గురించి అవమానకరంగా మాట్లాడిన కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను మరిపెడ బీజేపీ శ్రేణులు స్థానిక బస్టాండ్ సెంటర్లో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకులు గాదె రాంబాబు మాట్లాడుతూ రాహుల్ గాంధీ వెంటనే మోదీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ బాధ్యులు కట్టోజ్ గంగాధర్, భూక్యా మంగమ్మ లింగంనాయక్, భూక్యా కాంతమ్మ, పాల్వాయి భాస్కర్, పులి శ్రీనివాస్, సురేశ్, సాయికుమార్, రమేశ్, నాగరాజు, శ్రీనివాస్, సురేందర్ పాల్గొన్నారు.



డోర్నకల్ గాంధీ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు



మరిపెడలో రాహుల్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

● పెద్దవంగర : మోదీ తల్లిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ నాయకులు మండల కేంద్రంలోని తొర్రూరు-వలిగొండ ప్రధాన రహదారిపై రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగు రాములుగౌడ్, మండల అధ్యక్షుడు కట్టోజు భాస్కరాచారి మాట్లాడారు. మాజీ మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన సుధాకర్, కొయ్యడి ముఖేష్‌గౌడ్, సుధాకర్, శ్యామ్, అన్వేష్, ప్రశాంత్, కుమార్, శ్రీకాంత్, రాకేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

● దంతాలపల్లి : కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఇటీవల నరేంద్రపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయనను స్థానిక పోలీసులు తెల్లవారు జామున మండల కేంద్రంలో ముందస్తుగా అరెస్టు చేశారు. సొంత పూచికత్తుపై విడుదలైన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముందస్తు అరెస్టు అయిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు గుండగాని భరత్, రాణిరెడ్డి తదితరులున్నారు.

● గూడూరు : నరేంద్రమోదీ తల్లిని అవమానకరంగా మాట్లాడిన కాంగ్రెస్ అగ్రనాయకులు రాస్తారోకో చేసి ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెల్పూరి వెంకన్న, మేరెడ్డి సురేందర్, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబునాయక్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో మేరుగు మల్లయ్య, సోమునాయక్, నల్లగొండ అనిల్, రాజు, నాగరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

● డోర్నకల్ : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మాతృమూర్తిపై కాంగ్రెస్ నాయకులు అసభ్య వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీజేపీ కార్యకర్తలు ఆదివారం డోర్నకల్ గాంధీ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ రూరల్ మండల అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలపై రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్ర మోదీకి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలో జరిగే బీహార్ ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించిన కాంగ్రెస్ పార్టీ ఓట్ల చోరీ అంటూ కొత్త నాటకానికి తెరలేపిందన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవాసింగ్‌నాయక్, ఎస్‌కె. రెహమాన్, లక్ష్మీనారాయణ వ్యాస్, బాసాని నాగేష్, తోట అప్పారావు, మైనూ పాషా పాల్గొన్నారు.

కొనసాగుతున్న వినాయకుడి నవరాత్రి ఉత్సవాలు



సెవెన్ హిల్స్ కాలనీ వినాయక విగ్రహం వద్ద హోమంలో పాల్గొన్న నిర్వాహకులు



మహబూబాబాద్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీ వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న నిర్వాహకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంతో పాటు వివిధ కాలనీల్లో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల మండపాల వద్ద ఐదో రోజు ఆదివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేసి అన్నప్రసాద వితరణ చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని సెవెన్ హిల్స్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద అర్చకుడు రామానుజాచార్యుల వేదమంత్రోచ్ఛరణల నడుమ గణపతిహోమం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేసి అన్నప్రసాద వితరణ చేపట్టారు. సెవెన్‌హిల్స్ కమిటీ బాధ్యులు కోట సంజీవరెడ్డి, బండారు వెంకటరమణ, ఉప్పల శ్రీనివాసులు, గణేష్ ఉత్సవ కమిటీ బాధ్యులు కొండ్లె సీతారాములు, కొదుమూరి లక్ష్మీనారాయణ, తల్లాడ శ్రీనివాసరావు, అసోసియేషన్ అధ్యక్షురాలు కోట నిర్మలరెడ్డి, ఉప్పల పద్మ, శ్రీలత, నందిని, శిరీష, సుధా, రాము, కిషన్, కృష్ణారావు, అన్నప్రసాద వితరణ దాతలు కొదుమూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద రామసహాయం వెంకట్‌రెడ్డి-ఉమ, కట్ల వెంకన్న-మానస, గుగులోతు బాలు-మంగమ్మ, కొండపల్లి కర్ణాకర్‌రెడ్డి-శ్రీలత దంపతులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు.

● ఆర్టీసీ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ సొసైటీ బాధ్యులు పట్టాభి లక్ష్మయ్య, చంద్యానాయక్, అశోక్, సోమయ్య, శ్రీనివాసరావు, యాదగిరి, సుందర్, ప్రభాకర్‌రెడ్డి, రమేష్, మధుసూదన్ రెడ్డి, బాలాజీ, కృష్ణారెడ్డి, భాస్కర్, యూత్ సభ్యులు వరుణ్, నవీన్, సాగర్, ప్రవీణ్, మనోజ్, తరున్, శ్రీను, వికాస్, వినయ్ పాల్గొన్నారు.

● న్యూహౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత నిర్వాహకులు గణపతి హోమం నిర్వహించి, సుమారు 500 మందికి అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల రమేష్, నర్సింహారెడ్డి, భూపతి కిషోర్, మల్లారెడ్డి, మేకల శ్రీనివాస్, వీరారెడ్డి, వీరయ్య కమటం రమేష్, సింగం వెంకన్న పాల్గొన్నారు.

● కృష్ణకాలనీ, కొండపల్లి గోపాలరావు నగర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వల్ల నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో సీపీఐ మాజీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్ సారధిరెడ్డి, చింతకుంట్ల వెంకన్న, దామోదర్‌రెడ్డి, విష్ణు, కార్తీక్, శ్రీకాంత్‌రెడ్డి, అరవింద్, ఆనంద్, రామకృష్ణ, సత్యం, వెంకట్, రవి, కిరణ్, శ్రీను, వేంశెట్టి వెంకన్న, కుమార్ పాల్గొన్నారు.

● బయ్యారం : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బయ్యారంలోని రామాలయం, కాకతీయ నగర్‌తోపాటు మండల వ్యాప్తంగా పలు మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కాగా, రామాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్సై తిరుపతి ప్రారంభించారు.

● ఇనుగుర్తి : మండల కేంద్రం నెక్కొండరోడ్‌లో శ్రీలక్ష్మీవినాయక మండలి గణేష్ మండపం వద్ద అన్నదానం చేశారు. మండలి సభ్యులు మేడిద వెంకన్న, ముసుకు రాజు, యాకన్న, మహేందర్, వెంకన్న, పెంతల బుచ్చయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న గణనాథుడి వేడుకలు

● ముగ్గుల పోటీలు, మహా అన్నదానం

తొర్రూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మహా గణపతి నవరాత్రి వేడుకలు తొర్రూరులో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం పట్టణంలో నెలకొన్న మహా గణపతుల వద్ద ముగ్గుల పోటీలు, మహా అన్నదానం నిర్వహించారు. పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సోమేశ్వర్‌రావు హాజరై మాట్లాడారు. దేవుడి ఉత్సవాలు ఒకే చోట చేరి నిర్వహించుకోవడం అభినందనీయమని, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు నగదు బహుమతులు అందించి పాల్గొన్న వారికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. మంజునాథ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద వాసవీ క్లబ్ అధ్యక్షుడు చిదిరాల నవీన్ కుమార్, మహంకాళి రమేశ్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. 7వ వార్డు పరిధిలో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో 500ల మంది భక్తులకు బీజేపీ అర్బన్ అధ్యక్షుడు ఫైండ్ల రాజేశ్ ఆధ్వర్యంలో మహా అన్నదానం చేపట్టారు. దాతలు విక్రమ్, వెంకన్న, శ్రీనివాస్, కృపాకర్ రాజు, దొంగరి రేవతి శంకర్, ముద్దసాని సురేశ్, కుషాల్, మనోహర్, శ్రీనివాస్ లత, చీకటి శ్రీనివాస్, అమీర్, కిషన్, వెంకట్ రెడ్డి, శ్యాం సుందర్ రెడ్డి, ఇమ్మడి రాంబాబు తదితరులు ఉన్నారు.

●మరిపెడ : మరిపెడలోని పద్మశాలీల వినాయక మండపం వద్ద స్థానిక వస్త్ర వ్యాపారస్థుడు మేక వెంకటేశ్వర్లు-నాగమణి దంపతులు అన్నదానం నిర్వహించారు. గణేశుడికి ప్రత్యేక పూజలు చేశారు.

విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం

చిన్నగూడూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆదివారం చిన్నగూడూరులో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు మోత్కూరి శంకర్ అధ్యక్షత సమావేశం నిర్వహించారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొండపర్తి ఏకాంబ్రాచారి, ప్రధాన కార్యదర్శిగా ఎర్రోజు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా ఎర్రోజు రాజు, కోశాధికారిగా కొండపర్తి రమేశ్, సహాయ కార్యదర్శిలుగా కొండపర్తి రాజు, జూజ్జురి అనిల్‌లు ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు శంకర్ తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రోజు కృపాకరాచారి, ఉపాధ్యక్షుడు వెంకటరాజయ్యచారి, రవి, నగేష్, రమేశ్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు

● ఇద్దరికి గాయాలు

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : అదుపుతప్పిన కారు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనంను ఢీ కొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కలెక్టర్ కార్యాలయం సమీపంలోని మహబూబాబాద్ - మరిపెడ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కురవి మండలం మొగిలిచర్ల గ్రామానికి చెందిన నలమాస వీరన్న, నలమాస ఉదయ్ ఇద్దరు అన్నతమ్ముళ్లు. జిల్లా కేంద్రంలో పని ముగించుకొని తమకున్న ద్విచక్రవాహనంపై మొగిలిచర్లకు వెళ్తున్న క్రమంలో కురవివైపు నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న కారు అదుపుతప్పి ద్విచక్రవాహనంను ఢీకొన్నది. ఈ ఘటనలో నలమాస వీరన్నకు కుడికాలు, ఎడమ చేయి విరిగింది. ఉదయ్‌కి తలకు, శరీరంపై స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. స్థానికుల సహకారంతో క్షతగాత్రులను 108 వాహనంలో జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. 108 ఈఎంటీ మాచర్ల నరేష్, పైలట్ ప్రేమ్‌చంద్‌లను పనితీరు చేసి అభినందించారు.

ఇద్దరు వ్యక్తులు అదృశ్యం

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైనట్లు టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ పట్టణంలోని వేంకటేశ్వర బజారుకు చెందిన బోయిని రాంబాబు రైల్వేలో గేట్ మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో భాగంగా ఆగస్టు 24న సాయంత్రం డ్యూటీకి వెళ్లాడు. మరుసటి రోజు డ్యూటీ దగ్గర నుంచే భార్య ప్రియాంకకు ఫోన్ చేసి తనకు సీఐఎస్ఎఫ్‌లో క్లర్క్ ఉద్యోగం వచ్చిందని, సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ఉన్నదని చెప్పి విశాఖపట్నంకు వెళ్లినట్లు తెలిపారు. అదేరోజు నుంచి రాంబాబుకు ఎన్ని సార్లు ఫోన్‌కాల్ చేసినా స్విచ్‌ఆఫ్ వస్తుందని, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి లభించకపోవడంతో భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

● చికిత్స పొందుతూ మరొకరు..

గార్ల మండలం చంద్రగిరికి చెందిన బానోతు శోభన్‌బాబు కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకుండా ఉంటున్నట్లు తెలిపారు. ఆగస్టు 29న ఇంటివద్దనే గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆగస్టు 30న ఆస్పత్రిలో బాత్‌రూమ్‌కు వెళ్లివస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భీమునిపాదంలో పర్యాటకుల సందడి

గూడూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతంలో ఆదివారం సెలవుదినం కావడంతో పర్యాటకులు అధికంగా తరలివచ్చి సందడి చేశారు. గుట్టల మధ్య నుంచి 70 ఫీట్ల ఎత్తు నుంచి జాలువారుతున్న వాటర్‌ఫాల్స్ పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్, రేంజ్ అధికారి సురేష్‌లు అటవీ సిబ్బందిని ఏర్పాటు చేశారు.

కనీస వేతనాల జీవో అమలు చేయాలి

తొర్రూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు కనీస వేతన జీవోను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యం అన్నారు. ఆదివారం తొర్రూరులో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అధ్యక్షత వహించగా ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి, సూర్యం, యాకయ్య, వెంకన్న, బీకూ, మహేందర్, రవి కుమార్, పుల్లయ్య పాల్గొన్నారు.

యూరియా.. రామచంద్రా!

(5వ పేజీ తరువాయి)

రెట్టింపు అయింది. యూరియా, ఎరువుల వాడకం అధికంగా పెరిగింది. దానికి తోడు యూరియా దొరకదని మండలంలో విస్తృత ప్రచారం జరుగుతుండడంతో ఎలాగైనా యూరియా బస్తా సాధించాలని రైతులు ఎగబడుతూ.. క్యూలైన్‌లలో నిలబడుతూ డీలా పడుతున్నారు.

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 4,21,301 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. అయితే శనివారం నాటి వరకు 3,59,774 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. వరి 2,10,676 ఎకరాలు, మొక్కజొన్న 62,021 ఎకరాల్లో, పత్తి 82,539 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మొక్కజొన్న అధికారిక లెక్కల ప్రకారం.. కంటే అధిక రెట్టింపులో సాగవుతుంది. మొక్కజొన్నకు పంట దిగుబడి వచ్చే వరకు మూడు, నాలుగు బస్తాల యూరియా సరిపోతుంది. అయితే గూడూరు, కొత్తగూడ ఏజెన్సీ ప్రాంతాల్లో ఎకరానికి 9 బస్తాల వరకు యూరియా అధికంగా వేస్తున్నట్లు తెలుస్తోంది.

ఎక్కువ మోతాదులో వినియోగించొద్దు

● విజయనిర్మల, జిల్లా వ్యవసాయాధికారి

యూరియాను ఎక్కువ మోతాదులో వినియోగించొద్దు. యూరియా ఎక్కువగా వాడితే పురుగు, తెగుళ్ల పెరిగి చెట్లు బాగా ఏపుగా పెరిగే అవకాశం ఉంది. దీంతో గాలివాన వస్తే చెట్లు కిందపడి దెబ్బతిని నష్టపోయే ప్రమాదం ఉంది. ఇందుకోసం యూరియా వినియోగం తగ్గించుకోవాలి. జిల్లాలో ఇప్పటి వరకు 21,821 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశాం. రెగ్యులర్‌గా యూరియా సరఫరా జరుగుతుంది. యూరియా లేదనే అధైర్యం వద్దు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలుపర్చాలి

బయ్యారం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను వెంటనే అమలు పర్చాలని మలిదశ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) రాష్ట్ర కార్యదర్శి సోమారపు వీరస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆదివారం బయ్యారం మండలం బాలాజీపేట గ్రామంలో టీయూఎఫ్ నాయకులు పోస్టు కార్డు ఉద్యమ కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీకి పోస్టు కార్డు ద్వారా తమ సమస్యలను తెలియపరుస్తూ కార్డు పోస్టు చేశారు. ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలంతో పాటు నెలకు రూ. 25 వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. ఉద్యమకారులను గుర్తించే విధంగా గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. అదే విధంగా జార్ఖండ్ రాష్ట్రం తరహాలో సంక్షేమ పథకాల్లో ఉద్యమకారులకు 20 శాతం నిధులు కేటాయించడంతో పాటు పలు రాయితీలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు రామనాథం, వీరభద్రం, పద్మయ్య, వీరన్న, భీముడు, యా లాద్రి, జానీ పాల్గొన్నారు.

బూరుగుపాడు గుప్తనిధుల కోసం తవ్వకాలు

డోర్నకల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగుపాడు గ్రామశివారులో శనివారం రాత్రి కొందరు వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే..

బూరుగుపాడు-వెన్నారం రోడ్డు మధ్యలో ఉన్న మట్టం గుట్టపై గుప్తనిధుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు జేసీబీతో తవ్వకాలు జరిపారు. ఆదివారం ఉదయం అటువైపు వెళ్లిన కొందరు రైతులు దీనిని గుర్తించి వెళ్లి చూసారు. సుమారు 8 అడుగుల లోతు, 4 అడుగుల వెడల్పుతో తవ్విన గుంతను ఉండడంతో గుప్తనిధుల కోసమే తవ్వి ఉంటారని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తగూడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు, ఆర్‌బీఎస్‌కే ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ సంజీవ్‌నాయక్ కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, జనరల్ సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావుకు బానోత్ సంజీవ్ నాయక్ హైదరాబాద్‌లో ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, సమాన వేతనం ఇవ్వాలని కోరారు. పీఆర్సీతో పాటు హెల్త్‌కార్డు ఇవ్వాలన్నారు. పెండింగ్ ఏరియల్స్ త్వరగా ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మహిళలకు వేతనంతో కూడిన 180 రోజులు సెలవులు మంజూరు చేయాలని కోరారు.



జేఏసీ చైర్మన్‌కు వినతి పత్రం అందచేస్తున్న బానోత్ సంజీవ్ నాయక్

'మన్‌కీబాత్'ను వీక్షించిన బీజేపీ నేతలు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ 125వ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ నివాసంలో ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మన్‌కీబాత్ కార్యక్రమంతో సామాన్య ప్రజలు, దేశ అభివృద్ధికి చేస్తున్న కార్యక్రమమని కొనియాడారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు మన్‌కీబాత్ కార్యక్రమం ప్రాధాన్యత వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గడ్డం అశోక్, పల్లె సందీప్, వెన్నమల సందీప్, శ్యాం, గోపాల్‌గలెడా, గోవింద్ జావర్, బ్రిజ్జు గోపాల్‌లోయా, పార్వతి, మోతీరాం, హేమాలోయా, పద్మకలంత్రి పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించాలి

కురవి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : గొల్ల, కురుమ యాదవులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని టీపీసీసీ వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్నయాదవ్ డిమాండ్ చేశారు. కురవిలో ఆదివారం గొల్ల, కురుమ యాదవ సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. సెప్టెంబర్ 5న మహబూబాబాద్ యశోద గార్డెన్‌లో జరిగే యాదవ సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం గొల్ల, కురుమ యాదవులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. జిల్లా నాయకులు చిన్నాల కట్టయ్య యాదవ్, పయ్యావుల ప్రవీణ్, పాక వెంకన్న, వీరేష్, పాక రంజిత్, సురేష్ పాల్గొన్నారు.

పోలీసుల సమక్షంలో రైతులకు కూపన్ల పంపిణీ



రైతు వేదిక వద్ద రైతుల పేర్లను మైకులో పిలుస్తున్న ఎస్సై సురేష్.

నర్సింహులపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా యూరియా బస్తాల కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఎట్టకేలకు పోలీసుల సమక్షంలో వ్యవసాయ అధికారులు కూపన్లు అందజేశారు. ఆదివారం నర్సింహులపేటలోని రైతు వేదిక వద్ద కూపన్లు ఇస్తున్నారనే సమాచారంతో వందల సంఖ్యలో రైతులు చేరుకున్నారు. దీంతో వారిని కంట్రోల్ చేయడం వ్యవసాయ అధికారులకు సాధ్యం కాకపోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి రైతుల వద్ద ఆధార్, పట్టాదార్ పాసుబుక్కు జిరాక్స్‌లను సేకరించి మైకులో రైతుల పేర్లను పిలుస్తూ కూపన్లు అందజేశారు. సుమారు వేయ్యి మంది రైతులు రైతు వేదిక వద్దకు రాగా 770 కూపన్లు మంజూరు చేశారు. మిగిలిన రైతులు నిరాశతో ఇంటిబాట పట్టారు.

ముదిరాజులు ఒక్క తాటిపై నిలబడాలి

(5వ పేజీ తరువాయి)

నిధులు కేటాయిస్తున్నారే తప్ప, నిధులు మంజూరు కావడం లేదని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ఆరోపించారు. గత సంవత్సరం చేపపిల్లల పంపిణీ నామమాత్రంగానే జరిగిందని చెప్పారు. ఇప్పటి వరకు టెండర్లు కాలేదని అందుకోసం నేరుగా మత్స్యశాఖ సొసైటీల ఖాతాల్లో చేపపిల్లల కొనుగోళ్లకు నగదును వేయాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.120 కోట్లతో చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేసిందని, రూ.1000 కోట్లతో 62 వేల మందికి ద్విచక్రవాహనాలు అందించిందని తెలిపారు. నాడు సీఎం కేసీఆర్‌ను ఒప్పించి మెప్పించి దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి బైక్‌ను సాధించుకున్నామన్నారు. ఇవే కాకుండా 4 వేల మందికి ఆటోలు, డీసీఎంలు, బొల్లారో వాహనాలు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో బడ్జెట్‌లో కేటాయింపులుంటున్నాయే తప్ప నిధులు మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు నీలం దుర్గేష్, అశోక్, నర్సయ్య, పెద్ది సైదులు, గుండెల రాజు, రమేష్, కొప్పు రమేష్, అల్వాల సోమయ్య, యాకన్న, మారబోయిన వెంకటేశ్వర్లు, బయ్య ఉపేందర్, రొయ్యల నాగేశ్వర్‌రావు, వెంకన్న పాల్గొన్నారు.